ప్రజాశక్తి

సోమవారం 4 నవంబర్ 2024 5 శ్రీ సత్యసాయి

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు శ్రీకాంత్

'అనంత'లో సినీ హీరో శ్రీకాంత్ సందడి

"టేస్ట్ ఆఫ్ పులావ్ స్' రెస్టారెంట్‌ను ప్రారంభించిన నటుడు

ప్రజాశక్తి - అనంతపురం

ప్రముఖ సినీ నటులు శ్రీకాంత్ ఆదివారం అనంతపురంలో సందడి చేశాడు. 'టేస్ట్ ఆఫ్ పులావ్ స్' రెస్టారెంట్‌ను ప్రారంభించారు. సినీ హీరో శ్రీకాంత్ ను చూడడానికి అభిమానులు పెద్ద ఎత్తున గుమికూడారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అనంతపురంతో తనకు మంచి అనుబంధం ఉందని అన్నారు. తనపై ఇంతటి అభిమానం చూపిస్తున్న అభిమానులకు రుణపడి ఉంటానని అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఇటీవల ఏర్పాటైన శ్రేయాస్ గ్రాండ్ హోటల్ లో 'టేస్ట్ ఆఫ్ పులావ్ స్' వెజ్ అండ్ నాన్ వెజ్ రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రేయాస్ గ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీకాంత రెడ్డి, నగర ప్రముఖులు, అధికారులు వ్యాపారవేత్తలు, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

'స్మార్ట్' దగా

స్మార్ట్ మీటర్ల రాకతో మీటర్ రీడర్ల బతుకు ప్రశ్నార్థకంగా మారింది. ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో... ఎప్పుడు ఊడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా చాలీచాలని వేతనాలతో కొనసాగుతున్నారు. రెండు దశాబ్దాలుగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న వారు, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని నాటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్న సందర్భంలో తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని రీడర్లు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడే సర్కిల్ రీడర్లకు అర్హతలను బట్టి షిఫ్ట్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, గ్యాంగ్‌మెన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు ఏపీ మీటర్ రీడింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎస్ఈ కి వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 6 డివిజన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 350 మంది వరకు మీటర్ రీడర్లు విధులు నిర్వహిస్తున్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని హిందూపురం డివిజన్ పరిధిలో 68 మంది, కదిరి డివిజన్ పరిధిలో 50 మంది వరకు మీటర్ల రీడర్లు పనిచేస్తున్నారు. వీరు ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు విద్యుత మీటర్ రీడింగ్ తీస్తుంటారు. ఒక మీటర్ రీడింగ్ తీసినందుకు విద్యుత్ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.6 నుంచి రూ.7 చెల్లిస్తుంది. మిషన్ ఛార్జీలు, ఫోన్ రీచార్జి, రోల్స్, మరమ్మతులు ఈఎస్ఐ, ఈపీఎఫ్ కటింగ్‌లు పోను రీడర్ చేతికి వచ్చేది కేవలం మీటరుకు రూ.3.50 మాత్రమే. సగటున ఒక్కొక్క మీటర్ రీడర్ మూడు వేల నుంచి 3,500 మీటర్లకు రీడింగ్ తీసే అవకాశముంది. దీంతో వీరికి నెలకు రూ.10 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. గత రెండు దశబ్దాలుగా దీనినే నమ్ముకుని పని చేస్తున్న వందలాది మందికి స్మార్టు మీటర్లు రావడంతో ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం మాత్రం స్మార్టు మీటర్లు తొలు ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే బిగిస్తామని చెప్పుకొచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలో చూస్తే విద్యుత్ శాఖ స్మార్టు మీటర్లు బిగించడంలో నాలుగు విధానాలను పాటిస్తోంది. ఇందులో క్యాటగిరి వారిగా తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు బిగించింది. వెంటనే క్యాటగిరి-2 కింద ఉన్న దుకాణాలు, షాపులకు బిగిస్తోంది. ఈ మీటర్లు బిగిస్తే ఇంటికి వెళ్లి రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండదు. కార్యాలయంలో ఉండి ఎవరు ఎంత విద్యుత్‌ను వాడారో చూసి రీడింగ్ తీసే అవకాశం ఉంది. ఇలా తీసిన బిల్లులను సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎనర్జీ సెక్రేటరీల ద్వారా ప్రతి ఇంటికి బిల్లులను అందించే విధంగా విద్యుత్ శాఖ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ మీటర్ రీడర్ల ఉపాధికి గండం

స్మార్ట్‌మీటర్ల రాకతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో టెన్షన్

పట్టణంలో స్మార్ట్ మీటర్‌ను బిగిస్తున్న దృశ్యం

ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి

విద్యుత్ శాఖలో రెండు దశాబ్దాలుగా మీటర్ రీడర్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికి విద్యుత్ శాఖలో వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. మీటర్ రీడర్లలో చాలామంది ఐటిఐ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న వారు ఉన్నారు. చాలీ చాలని వేతనాలను తీసుకుంటూ ఎన్నో సంవత్సరాలుగా వారు పని చేస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తారు అనుకునే సమయంలో స్మార్టుగా ఉద్యోగాలు పోతున్నాయనితెలిసి వారందరు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి కోల్పోతున్న వారందరికి వారి విద్యార్హతను బట్టి విధ్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో అందరు ఉద్యోగాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.ప్రభుత్వం వీరి పట్ల సానూకూల నిర్ణయం తీసుకుని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. రెండు దశాబ్దాలకుపైగా పనిచేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. వీరంతా మీటర్‌కు కొంత రేటు చొప్పున వేతనం పొందుతున్నారు. ఇంత కాలంగా పనిచేస్తున్నా నేటికీ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగానే పనిచేస్తున్నారు. సీనియార్టీ, అర్హతలను బట్టి విద్యుత్ శాఖలో వీరికి ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం ఇవ్వాలి. చిరుద్యోగులపట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండకు త్వరలో మరిన్ని పరిశ్రమలు రానున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గంలోని 5 మండలాలక్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, ఫీల్డ్ అసిస్టెంట్ ,డీలర్ , యానిమేటర్ల ,టీడీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే టిడిపికి బలమన్నారు. కార్యకర్తల మేలు కోసం జీవితా బీమాతో కూడిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. నియోజక వర్గంలోని ప్రతి మండల, పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు నెలకొల్పనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కియా వంటి పరిశ్రమలు ప్రస్తుతం పెనుకొండలో ఉన్నాయని, మహిళలు కోసం గార్మెంట్ పరిశ్రమలు భవిష్యత్తులో పెనుకొండకు రానున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని కొట్నూరు నిర్మలా వద్ధాశ్రమంలోని ఒయాసిస్ చర్చిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శ్రీ హీలింగ్ వైద్యశాల నిపుణులు ప్రశాంత్ కుమార్, చేతన తదితరులు సామాజిక సేవకురాలు ఆలిశెట్టి శ్వేతా ఆధ్వర్యంలో పాస్టర్ జాన్ అధ్యక్షతన ముదిరెడ్డి పల్లి అఖిలాంధ్ర పట్టు చేనేత కార్మిక గౌరవాధ్యక్షులు ఏసీ. నాగరాజు సహకారంతో ఉచిత హీలింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతు వాయిద్య పరికరాలు టిబెటియన్ బౌలింగ్ లాంటి పరికరాలతో శబ్ద తరంగాలతో వైద్యం అందిస్తామన్నారు. అనంతరం వృద్ధులకు మహిళలకు వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం యువ నాయకులు ఉసామా ఖాన్, బాబన్న, గంగప్ప, అంజన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వ్యవసాయ శాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు జియం.ఆల్తాఫ్ అలీఖాన్ అనంతపురం జిల్లా ప్రభుత్వ సర్వ జనాసుపత్రిలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. వ్యాధి గ్రస్తులకు వారి కుటుంబ సభ్యులకు మధ్యాహ్న భోజనం, బన్, బిస్కెట్లు, పండ్లు అందించారు. తన భార్య రహీం ఉన్నిసా జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం మధ్యాహ్న భోజనం అందించానని అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్‌తో పాటు ఆయన కుమార్తెలు ఉజ్మ మెహతాజ్, తజ్కియా తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి : యుటిఎఫ్

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ధర్మవరం అర్బన్, రూరల్ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 5 నెలలు కావస్తున్నా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సుందన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ నెల 10 వ తేదీన కదిరిలో జిల్లా స్వర్ణోత్సవ మహా సభలు నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల కమిటీలను ఎన్నుకున్నారు. ధర్మవరం పట్టణ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జింక హరికృష్ణ, పోసాయి గణేష్, ధర్మవరం రూరల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎం ఆంజనేయులు, జనార్దన్ బాబును ఎన్నుకున్నారు. అలాగే ధర్మవరం అర్బన్ గౌరవాధ్యక్షులుగా రామకృష్ణ నాయక్, ఉపాధ్యక్షులుగా బి. ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలుగా లతాదేవి, కోశాధికారిగా హెచ్. రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్లుగా మేరీ వరి కుమారి, మణిమాల, లక్ష్మయ్య, రాంప్రసాద్, ధర్మవరం రూరల్ గౌరవాధ్యక్షులుగా పూజారి విజయ భాస్కర్, ఉపాధ్యక్షురాలుగా తులసి, ఉపాధ్యక్షులుగా ఎంవి. వెంకట కిషోర్, కోశాధికారిగా అమర్ నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన సభ్యులు ఉపాధ్యాయ సమస్యల పట్ల విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా కేసులో వ్యక్తి అరెస్టు

నిందితుడి నుంచి 469 నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు స్వాధీనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూసిన కదిరి పట్టణం నిజాంవలి కాలనీకి చెందిన షేక్ షామీర్ బాషా అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కదిరి పట్టణం కొత్త బైపాస్ రోడ్డులో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి సర్వే నెంబర్1777 -2లో ఈ నెల 13న నిజాంవలి కాలనీ కి చెందిన షేక్ షామీర్ బాషా జేసీబీ సాయంతో చదును చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు భూ ఆక్రమణ చట్టం కింద కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు అయినప్పటి నుండి పరారీలో ఉన్న షేక్ షామీర్ బాషాను ఆదివారం అరెస్టు చేసి అతని వద్ద నుండి సుమారు 301 దొంగ పట్టాలు, 168 జిరాక్స్ నకిలీ పట్టాలు స్వాధీనం చేసుకున్నామని సిఐ చెప్పారు. అంతేకాకుండా ఇతర మండలాలకు చెందిన 32 పట్టాదారు పాసుపుస్తకాలు, పలు రకాల ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు లో భాగంగా నిందితుడిని విచారించగా నిందితుడు కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ప్రధాన అనుచరుడని తేలిందన్నారు. అత్తార్ చాంద్‌బాషా ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో ప్రభుత్వం ద్వారా నాగిరెడ్డి పల్లి రైల్వే ట్రాక్ పక్కన ఉన్న సర్వే నెంబర్ 1022, 931-1లలో ప్రభుత్వం తరపునుండి నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు పంపిణి చేసే విషయంలో కూడా పలువురి నుంచి వేలాది రూపాయలు వసూలు చేసినట్లు తేలిందన్నారు. అంతేకాకుండా సర్వే నెంబర్ 1777-2లోని భూమి విషయంలో నకిలీ పత్రాలు సృష్టించి పేదలకు విక్రయించారని తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు షేక్ షామీర్ బాషాను అరెస్ట్ చేసి ల్యాండ్ గ్రాబింగ్ కేసుల ప్రత్యేక కోర్టు, అనంతరం కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్ర దారులుగా ఉన్న రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మున్వర్, పరికి షామీర్ బాషా, కొలిమి అర్షద్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సిఐ చెప్పారు.

నేడు పరిటాల శ్రీరామ్ పర్యటన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఈ నెల 4వ తేదీ సాయంత్రం పోతుకుంట పంచాయతీ బిసి కాలనీలో పర్యటిస్తారని రూరల్ కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న తెలిపారు. పరిటాల శ్రీరామ్ టిడిపి సభ్యత్వ నమోదు, ఆ తర్వాత పోతుకుంట చెరువులో గంగపూజ కార్యక్రమాల్లో పాల్గొం టారన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు చర్యలు

జిల్లా ఎస్పీ వి. రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో నేరాలను నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకొని ప్రజలలో పోలీసులు పట్ల మంచి అభిప్రాయం ఏర్పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్న వ్యక్తులు ఎలాంటి వారినైనా ఉపేక్షించబోమని, రాజకీయ ఒత్తిడులకు తొలొగ్గమని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించిన వారు ఎలాంటి వారినైనా ఉపేక్షించమని తెలిపారు.

ప్రశ్న : మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మీ అభిప్రాయం

జవాబు: జిల్లావ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాం. నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు గట్టిగా పనిచేసి పోలీస్ శాఖ పట్ల ప్రజల విశ్వాసంతో పెంచే విధంగా చర్యలు చేపడుతున్నాం. మహిళలు చిన్నారులపై జరిగే అఘాయిత్యాలపై వెంటనే నిందితులను గుర్తించి వారిని ఫోక్సో చట్టాన్ని ఉపయోగిస్తున్నాం. మహిళలు చిన్నారుల విషయాల్లో ఎలాంటి వారైనా ఉపేక్షించబోం. సైబర్ నేరాలు, మహిళల భద్రతపై పోలీసులు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇంటి భద్రతపై మహిళలకు అవగాహన కల్పించి, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. ఎలాంటి అనుమానితులు అనిపించినా పోలీసులు దృష్టికి తీసుకురావాలని పోలీస్ నెంబర్లను వారికి అందజేశాం.

ప్ర : జిల్లాలో నేర నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

జ: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో నేరాల నియంత్రణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఉన్న సరిహద్దు పోలీస్‌స్టేషన్లలో అన్ని నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాం. సరిహద్దు పోలీస్ స్టేషన్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మద్యం అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఫ్యాక్షన్ గ్రామాల్లో నెలకొంటున్న పరిస్థితులను వెనువెంటనే తెలుసుకుంటున్నాం. మహిళ పోలీసులు తరచూ గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా నేరాల రేటును తగ్గించడానికి ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించి అక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో తెలుసుకొని సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చాం.

ప్ర : ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా దొంగతనాలు దోపిడీలు పెరిగిపోతున్నాయి, దానిపై మీ అభిప్రాయం.

జ: సత్య సాయి జిల్లాలో శాంతి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాం. చోరీల నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. రాత్రి వేళల్లో జిల్లా పోలీసులు ముమ్మరంగా గస్తీలు, పెట్రోలింగ్, నైట్ బీట్ చెకింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నాం. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్లు, లాడ్జిల్లో, అర్ధరాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచితుల వ్యక్తులపై తనిఖీలు చేసి అలాంటి వారిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం.

ప్ర : గంజాయి అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టి గంజాయి, కర్నాటక మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరక్కుండా చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి వేళల్లో ముమ్మరంగా గస్తీలు పెట్రోలింగ్ నిర్వహించి జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నాం.

ప్ర : జిల్లాలో యువతకు మీరిచ్చే సలహా..

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఇటీవల నేరాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. వారిలో యువకులు పాత్ర ఎక్కువగా ఉంది. మద్యం, గంజాయి మత్తులో యువకులు ఎక్కువ శాతం నేరాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ప్రజాశాంతికి భంగం కలిగించినా అలాంటి వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నాం. వీటితోపాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పై కేసులు నమోదు చేస్తున్నాం.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, నాయకులు

యుటిఎఫ్ సేవలు అభినందనీయం

స్వర్ణోత్సవ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరించిన మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) సేవలు ఎనలేనివని బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లయిన సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 10వ తేదీ కదిరి పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నారు. యుటిఎఫ్ నాయకులు మహాసభలకు మంత్రిని ఆహ్వానించారు. అలాగే మహాసభల పోస్టర్లను ఆదివారం మంత్రి సవిత పట్టణంలోని టిడిపి కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ యుటిఎఫ్ 50 ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణకు పాటుపడడంతో పాటు సమాజం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నప్పుడు అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూ తన్న, సీనియర్ నాయకులు నారాయణస్వామి, జి.రమేష్ , రవీంద్రనాథ్, ఉపేంద్ర, ఆదిజినేష్, నరసిం హులు, సుదర్శన్, రామాంజనేయులు, గోవిందప్ప, ఎం.ఆంజనేయులు, ఎ.లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, బిల్లే రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ని ఆదివారం ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ ఎంఎస్.రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి సోమవారం జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.



మంత్రి సత్యప్రసాద్‌కు పూలబొకే ఇస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

జిల్లాలో పోలీసులు విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీసులు రోడ్డుపైకి వచ్చి విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాల తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రహదారులు, హైవేలు ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేశారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధిస్తూ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో పర్యటించి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

6 నుంచి చేనేత క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలో ఈ నెల 6వ తేదీ నుంచి ధర్మవరం చేనేత క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టిడిపి పట్టణ నాయకులు సంధా రాఘవ సోదరులు తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు రూ. లక్ష, రన్నర్స్ జట్టుకు రూ. 50వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ. 20వేల, రూ. 10వేలు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. టోర్నమెంట్‌కు దాతలు చందు, జనార్దన్, పురుషోత్తం, శశాంక్, చౌడయ్య, విశ్వనాథ్, మూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు అన్నం సాయినాథ్-970065 3520, భరత్ కుమార్-733771475, ఫయాజ్-7780595596లకు ఫోన్ చేసి జట్టు పేరు నమోదు చేసుకోవలని తెలిపారు.

సంధా రాఘవ సోదరులు

రాష్ట్ర స్థాయి పోటీలకు గౌడనహళ్లి విద్యార్థినులు

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని గౌడనహళ్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అండర్ -17 బేస్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పిడి అరుణ తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీల్లో లావణ్య, సాఫ్ట్ బాల్ పోటీల్లో దీక్ష ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. పిడి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం ఎంతో అరుదు అన్నారు. వీరు విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ఎంతో గర్వకారణమని తెలిపారు.

పిడి అరుణతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన లావణ్య, దీక్ష

వైసిపి కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని టి.కుంట్లపల్లి గ్రామానికి చెందిన వై.తిరుపాల్‌నాయుడు ఇటీవల బైక్ ప్రమాదం లో గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకుని ఆదివారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి తిపుపాల్‌నున పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని, అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, లక్ష్మీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళి, షామీర్‌బాషా, రఫీక్, తదితరులు ఉన్నారు.

5న చలో విజయవాడను జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ నెల 5వ తేదీ విజయవాడలోని హనుమంతరావు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఎపి ఎమ్మార్పీఎస్ దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధుల సదస్సును జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు ఎన్. లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ విజయవాడలో ఎపి ఎమ్మార్పీఎస్ 11వ వార్షికోత్సవ మహాసభ నిర్వహిస్తున్నారని, ఆ సభకు ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య హాజరవుతారని తెలిపారు. మహాసభలో ఎస్సీ వర్గీకరణ, మాదిగల ఐక్యత, వారిపై జరుగుతున్న దాడులు, తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఎన్టీఆర్‌తోనే బడుగులకు రాజ్యాధికారం

ప్రజాశక్తి-రొద్దం

నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యుఎస్, సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. స్థానిక పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో సంత మార్కెట్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఆదివారం మంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసి మాట్లాడారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండల, పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు, మండల కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా పేద, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం ఉండేది కాదన్నారు. అటువంటి సమయంలో ఎన్టీఆర్ టిడిపిని స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారన్నారు. సర్పంచులు, జడ్పీటీసీలు, జడ్పీ ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా అవకాశమిచ్చారన్నారు. పూల వ్యాపారం చేసుకునే తన తండ్రి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిని చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. సిఎం చంద్రబాబు ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన తనలాంటి వారెందరికో రాజకీయ ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తారన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అర్హులందరికీ పింఛన్లు అందజేస్తామన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ఐ టిడిపి నాయకులు పెద్దగువ్వలపల్లి పవన్ సమకూర్చిన దుస్తులను మంత్రి సవిత 14 మంది పంచాయతీ కార్మికులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం పంచాయతీ వర్కర్లు వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్నారని వారి సేవలను కొనియడారు. టిడిపి సభ్యత్వ నమోదులో జిల్లాలో పెనుకొండ నియోజకవర్గాన్ని ప్రథమస్థానంలో నిలపాలని పిలుపు నిచ్చారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా అధినాయకత్వం పనిచేస్తోందన్నారు. సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గత ఎన్నిల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహులు, మండల కన్వీనర్ నరహరి, నాయకులు మాధవనాయుడు, మునిమడుగు శ్రీరాములు, పరిగి, సోమందేపల్లి మండల కన్వీనర్లు చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, నరసింహులు, టైలర్ ఆంజనేయులు, అశ్వర్థనారాయణ, పవన్, శ్రీనాథ్‌గుప్తా, వీరాంజి, చంద్రశేఖర్, హరీష్, పవన్, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, బేల్దారి క్రిష్టప్ప, మనోహర్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

మండలంలోని ఆర్.మరువపల్లి ఎంజెపి పాఠశాలలో మంత్రి సవిత విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ నన్ను కలవడానికి వచ్చిన వారు నోటు పుస్తకాలు, పెన్నులు తీసుకొచ్చి శుభాకాంక్షలు తెలిపారన్నారు. వాటిని విద్యార్థులకు అందజేశామన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

రొద్దంలో విగ్రహ ఏర్పాటుకు మంత్రి సవిత భూమిపూజ

పంచాయతీ వర్కర్లుకు దుస్తులు అందజేస్తున్న మంత్రి సవిత

రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగునీరు

ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు

పుట్టపర్తిలో పడకేసిన పారిశుధ్యం..!

ప్రధాన రహదారుల్లో మురుగు, చెత్తకుప్పలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై ప్రధాన రహదారుల్లో కాలువలు నిండి మురుగు రోడ్లపైకి చేరుతోంది. అలాగే ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. స్థానిక స్టేట్ బ్యాంక్ వీధి చివరిలో మురుగునీటి ఛాంబర్ వ్యర్థాలతో కూరుకుపోయి నీరు ప్రధాన రహదారిపైకి పొంగిపొర్లుతున్నాయి. ఆదివారం ఆ వీధి చిన్నపాటి కుంటని తలపించింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ప్రధాన రహదారిలో ఎక్కడ చూసినా చెత్త చెదారం గుట్టలుగా పేరుకు పోయింది. దీంతో రహదారుల్లో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. గతంలో అధికారులు మరమ్మతులు చేయించినా మళ్లీ మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. మరోవైపు ఈ నెల 23వ తేదీ సత్యసాయి జయంతి వేడుకలు సమీపిస్తున్న తరుణంలో ఇలా మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో అసహ్యకరంగా ఉందన్నారు.

16న 'అనంత'లో మాదిగల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి-కదిరిటౌన్

2011 జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ నెల 16వ తేదీ అనంతపురం నగరంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతారని మాదిగలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. పట్టణంలోని రోడ్లు, భవనాలు అతిథి గృహంలో ఆదివారం మాదిగ ఉద్యోగులు సమావేశమై చర్చించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఎఫ్ జాతీయ సభ్యులు జి.ఆనంద్, విశిష్ట అతిథులుగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పలక ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి విజయ్, కదిరి డివిజన్ అధ్యక్షులు కె.శ్రీనివాసు లు హాజరయ్యారు. నాగేంద్రనాథ్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణను జిల్లాల వారీగా అమలు చేసి, దళితులందరికీ సమన్యాయం చేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సిఎం చంద్రబాబు తక్షణమే అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తర్వాతనే రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో కదిరి డివిజన్ ఎంఈఎఫ్ నాయకులు చిన్నప్పయ్య, నాగప్ప, పుల్లన్న, శివనాథ్, ఎమ్మార్పీఎస్ నాయకులు విశ్వనాథ్, పసల శ్రీనివాసులు, గంగాధర్, మున్సిపల్ కార్మికులు సూరి, చక్రి, ఎంఎస్ఎఫ్ నాయకులు మురళీ, బాలాజీ, గౌతమ్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించొద్దు

ప్రజాశక్తి-బత్తలపల్లి

గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించవద్దని ఎస్ఐ సోమశేఖర్ హెచ్చరించారు. మండలం లోని ఈదుల ముష్టూరు గ్రామంలో ఆదివారం ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కక్షలు, కార్పణ్యాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, వాటి వల్ల మరింత దుర్భర జీవితం గడపాల్సి ఉంటుందని హెచ్చరించారు. పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం విక్రయించే వారి సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రౌడీ షీటర్లు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా వచ్చి తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ సోమశేఖర్

అధ్యాపక వృత్తి గౌరవప్రదమైంది..

ప్రజాశక్తి - హిందూపురం

అధ్యాపక వృత్తి సమాజంలో ఎంతో గౌరవ ప్రదమైనదని వాసవి పీఠం రెండవ గురువైన శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం పట్టణంలోని ఎస్ డి జి ఎస్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందిందని ఆ సాంకేతికతను మంచి కోసం ఉపయోగించాలని కోరారు. తద్వారా సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అధ్యాపక వత్తి ఎంతో పవిత్రమైందన్నారు. అధ్యాపకులు బోధించే విషయాల వల్ల ఎంతోమంది కలెక్టర్లు, ఎస్పీలు, న్యాయవాదులు, వైద్యులు, నాయకులుగా తయారవుతున్నారని పేర్కొన్నారు. ఎస్ డి జి ఎస్ కళాశాల పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉచిత విద్యను అందిస్తుండడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి బైసాని రాంప్రసాద్, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రేవూరి చంద్రమోహన్, దాస సురేష్, దాసా గంగాధర్, నందకిషోర్, ప్రిన్సిపల్ జెఎస్‌విఎస్ ప్రసాద్, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కెంపెగౌడ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-మడకశిర

మండల కేంద్రమైన అమరా పురంలో కెంపెగౌడ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆదివారం టిడిపి కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప భూమి పూజ చేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కెఎన్ పల్లి సురేష్, తమ్మడేపల్లి హను మంతరాయప్ప, వీరక్యాతప్ప, రవి, తిమ్మేగౌడ, గణేష్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

ప్రజాశక్తి-మడకశిర

మల్లినమడుగు గ్రామపంచాయతీలోని జీర్గేపల్లి గ్రామంలో కరిమారెప్ప కుటుంబానికి చెందిన ముడుపన్న ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర టిఎన్‌టి యుసి ప్రధాన కార్యదర్శి గురుమూర్తి వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఒడి చెరువులో ట్రాఫిక్ అస్తవ్యస్తం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక హిందూపురం- కదిరి ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారై ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బస్టాండ్ ఆవరణలో ఆదివారం వాహనాలను ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు దారిలోనే పెట్టి వెళ్లిపోయారు. ద్విచక్ర వాహనాలను రోడ్డుకు ఇరువైపులా ఎలా పడితే అలా పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లపై దుకాణాలు నిర్వహిస్తున్నారు. తద్వారా వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఒడి చెరువులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒడిసిలో స్తంభించిన ట్రాఫిక్

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - బుక్కపట్నం

టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మారాలలో వైసిపి కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌతమ్‌ను ఆయన ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. రౌడీయిజం దౌర్జన్యం చేసే వ్యక్తులపై పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరించి కట్టడి చేయాలని సత్య సాయి జిల్లా ఎస్పీ రత్నను కోరినట్లు మాజీమంత్రి తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే పల్లె సింధూర కూడా టిడిపి కార్యకర్త గౌతమ్‌ను ఫోన్లో పరామర్శించారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదవశాత్తూ వంగపేరులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని బండ్లపల్లి పంచాయతీ పరిధిలోని కమ్మవారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న వంగపేరు నదిలో ఆదివారం ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. పెనుకొండ మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన మహేష్(35) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. దీపావళి పండుగకు వారి సమీప బంధువులు ఉంటున్న కమ్మవారిపల్లికి వచ్చారు. ఉదయం వారి బంధువుల పొలానికి వెళ్లాడు. సమీపంలో వంగ పేరు నది ప్రవహిస్తుండగా చూడడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో పడి మునిగిపోయాడు. గమనించిన చుట్టుపక్కల పొలాల రైతులు మహేష్‌ను నీటిలో నుంచి బయటకు తీసి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

కర్నాటకలో రోడ్డు ప్రమాదం.. పైపల్లి యువకుడు మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కర్నాటకలోని చిక్‌బల్లాపూర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పైపల్లి గ్రామానికి చెందిన అభిషేక్(20) మృతి చెందాడు. వివరాలు.. పైపల్లి గ్రామానికి చెందిన బాల ఏటన్న కుటుంబం 8 ఏళ్ల క్రితం ఉపాధి కోసం బెంగళూరుకు వలపస వెళ్లి అక్కడే స్థిరపడింది. 20 రోజుల క్రితం కొత్త స్కూటీ కొనుగోలు చేసిన అభిషేక్ తన బావమరిదితో కలిసి బెంగళూరు నుంచి సొంతూరు పైపల్లి గ్రామానికి బయల్దేరాడు. చిక్‌బల్లాపూర్ సమీపంలోకి రాగానే స్కూటీ అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌కు ఢీకొట్టడంతో నడుపుతున్న అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక వైపు కూర్చున్న తన బావమరిది గాయపడ్డాడు. కుమారుడి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. ఆదివారం పైపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని మారాల గ్రామానికి చెందిన మేకల గౌతం శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కొందరు వైసిపి నాయకులు ఇటీవల రస్తా విషయంలో గౌతమ్ తండ్రి నారాయణస్వామితో గొడవ పడి గాయపరిచారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో వైసిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపుతామని బెదిరించడంతో మనస్థాపానికి గురైన గౌతమ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమించడంతో గౌతమ్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం టూ టౌన్ పోలీసులు దాడులు చేశారు. సిఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. పట్టణ పరిధిలోని తారకరామాపురం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 14,150 నగదు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కదిరి అర్బన్ : దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. బాల మురళికృష్ణ అనే వ్యక్తి వారి తోట వద్ద టపాసులు కాలుస్తూ ఉండగా ఆ ప్రాంతంలో నివాసమున్న కొంతమంది అక్కడికి వెళ్లి 'టపాసులు కాల్చవద్దు, పక్కకి వెళ్లి కాల్చండి' అని చెప్పినందుకు బాలమురళికృష్ణ తనపై దాడి చేసి తలపై కొట్టి తీవ్రంగా గాయపరచడానికి హరి ప్రసాద్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి-రాయచోటి రోడ్డు పనుల్లో భాగంగా ఆదివారం మండలంలోని తాళ్లకాలవ వద్ద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి, గాండ్లపెంట, నంబులపూలకుంట వరకూ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నూత నంగా 4 హిటాచిలు, జెసిబి వాహనాలతో నిర్మాణం పనులు చేపడుతున్నార న్నారు. పనులను డిసెంబర్‌లోపు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కాంట్రాక్టర్ కృష్ణనాయుడు, నాయకులు ఎస్‌వి.సికిందర్, రవీంద్రారెడ్డి, అక్రంబాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ధర్మవరం రూరల్ : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డాక్టర్ బైశాని మేఘన సూచించారు, స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం ధర్మవరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, యువర్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా సంస్థల నిర్వాహ కులు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. డాక్టర్ బైసాని మేఘన మాట్లాడుతూ డయాబెటిస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే డయాబెటిస్‌పై పలు సూచనలు, జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, ప్రమోటర్స్ పాల్గొన్నారు.

ఎంపీ వర్గీయులు ముందస్తు అరెస్ట్

రొద్దం : రొద్దంలో టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం మంత్రి సవిత భూమిపూజ చేస్తారని శనివారం ప్రకటించారు. దీంతో ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో అందుకు ఏర్పాట్లు చేపట్టారు. అయితే ఎంపి బికె.పార్థసారథి సొంత మండలం కావడంతో ప్రొటోకాల్ ప్రకారం ఎంపిని ఆహ్వానించకపోవడంతో స్థానికంగా ఉన్న ఎంపి బికె వర్గీయులు అక్కడికి చేరుకొన్నారు. ఈ విషయం గమనించిన పోలీసులు వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే వారు ప్రొటోకాల్ ప్రకారం ఎంపిని ఎందుకు ఆహ్వానించలేదని వారు వాదనకు దిగారు. దీంతో మంత్రి సవిత పర్యటనకు ఆటంకం కలగకుండా పోలీసులు ఎంపి వర్గీయులను ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించి మంత్రి పర్యటన ముగిశాక వదిలేశారు. మంత్రి పర్యటనలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనుకొండ సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో రొద్దం, సోమందేపల్లి ఎస్ఐలు, కియా ఎఎస్ఐ, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఎంపి బికె వర్గీయులకు సర్ది చెబుతున్న పోలీసులు

పూర్వ విద్యార్థుల కలయిక

బత్తలపల్లి : మండలంలోని నల్లబోయినపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి స్నేహితులను కలిసి అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారున. అప్పటి ఉపాధ్యా యులను సన్మానించారు. స్నేహితురాలు అంజలి కుమారి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా ఆమెకు రూ. లక్ష అందజేశారు.

నల్లబోయినపల్లి హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు